క్లుప్తంగా

ఉత్సాహంగా క్రీడా పోటీలు



యాదవ ఉద్యోగుల క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఆచార్యులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యాదవ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉద్యోగులకు క్రీడా పోటీలు ఉత్సాహంగా మొదలయ్యాయి. ఏయూ మైదానంలో ఈ పోటీలను ఆచార్య ఎస్.హరనాథ్, ఆచార్య ఎస్.విజయ్‌మోహన్‌లు ప్రారంభించారు. క్రికెట్ పోటీల్లో విజేతగా గొంప శ్రీనివాస్ టీం, రన్నర్‌గా బొట్ట రామచందర్ రావు టీంలు నిలచాయి. ఆదివారం షెటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తారు. దువ్వి గోవింద్, డొక్కర శ్రీనివాసరావు, కె.శ్రీనివాస్, కొయ్య నరసింగరావు, బందం రాజు, నమ్మి గణేష్, కోన పోలారావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రిన్సిపాల్‌పై నిష్పక్షపాతంగా విచారణ జరపాలి'

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయ్‌బాబు తీరుపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని ఆల్ ఇండియా డెమొక్రాటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్(ఏఐడీఎస్‌వో) జిల్లా అధ్యక్షుడు కె.అభిలాష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కళాశాలలో బీబీఏ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థిని కొద్ది రోజుల కిందట యూనిఫాం ధరించకుండా కాలేజీకి వచ్చినందుకు ప్రిన్సిపాల్ ఆమెను మందలించడంతోపాటు ఫొటో తీసి కళాశాల అధ్యాపకుల గ్రూప్స్‌లో పెట్టిన విషయంపై ఆ విద్యార్థిని విద్యా శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా.. దీనిపై ఈ నెల 12న విచారణ చేయబోతున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఏ విద్యార్థి అయినా యూనిఫాం ధరించి కళాశాలకు రాకపోతే.. ఆ విద్యార్థితో మాట్లాడి సరిదిద్దాలే తప్పా ఫొటో తీసి అధ్యాపకుల గ్రూప్‌ల్లో పెట్టడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. ఇలా చేయడం ద్వారా ఆ విద్యార్థినిని అవమానించినట్లు అవుతుందన్నారు. దీనిపై సమగ్రంగా విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

ఘనంగా ఎల్లమ్మ తల్లి పండగ



అమ్మవారి ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డు పెదవాల్తేరులోని మద్దివారి ఇలవేల్పు ఎల్లమ్మ తల్లి పండగను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ ముువ్వల లక్ష్మి, సురేష్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అమ్మవారి ప్రతిమను భక్తులు పురవీధుల్లో ఊరేగించారు.

చిన్నారుల సందడి



డిగ్రీ పట్టాలు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

ఎంవీపీకాలనీ: ఉషోదయ కూడలిలోని కిడ్జిగార్డెన్ పబ్లిక్ స్కూల్ గ్రాడ్యుయేషన్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి స్కూల్ ప్రిన్సిపాల్ సాయిలక్ష్మి వివిధ తరగతుల్లో ఈ ఏడాది ఉత్తీర్ణత సాధించిన చిన్నారులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధతో విద్య బోధిస్తున్నామన్నారు. అన్ని అంశాల్లో చైతన్యపరుస్తూ బహుముఖ నైపుణ్యవంతులుగా చిన్నారులను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు సందడి చేస్తూ సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు.

దయచూపే ఇలవేల్పు

పద్నాలుగు గ్రామాల దేవత పైడిమాంబ

- 11న ప్రధాన జాతర, పరస
- అత్యంత ఘనంగా నవరాత్రి ఉత్సవాలు
- అమ్మవారిని దర్శించనున్న వేలాది మంది భక్తులు



డెయిరీఫారం వద్ద కొలువైన పైడిమాంబ

ఆరిలోవ: జాతీయ రహదారిని ఆనుకొని డెయిరీఫారం వద్ద కొలువైన పైడిమాంబ అమ్మవారి నవరాత్రి జాతర మహోత్సవాలు అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. ఒకప్పుడు 14 గ్రామాల దేవతగా అమ్మవారు పిలువబడేవారు. ఇప్పుడా గ్రామాల్లో కాలనీలు వెలియడంతో అవి పదుల సంఖ్యకు చేరాయి. అన్ని గ్రామాల ప్రజలు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఇలవేల్పుగా కొలుస్తున్నారు. జాతర మహోత్సవాలను కొన్ని దశాబ్దాలుగా జరుపుతున్నామని నిర్వాహకులు, స్థానికులు చెబుతున్నారు.

ప్రతిష్ఠాత్మకంగా ఉత్సవాలు

ప్రతి ఏటా ఫాల్గుణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే మంగళవారం పైడిమాంబ పండగ నిర్వహిస్తారు. ఆలయ కమిటీ సభ్యులు ఏటా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమ్మవారి జాతర జరుపుతుంటారు. ఈ నెల 3న ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు 11వ తేదీ మంగళవారంతో ముగియనున్నాయి. వేడుకల్లో భాగంగా నిత్యం పైడిమాంబకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు, కలశ పూజ, కుంకుమార్చన, సహస్ర నామ పారాయణం, భజనలు చేస్తున్నారు.

దశాబ్దాలుగా కొలుస్తున్నారు..

సుమారు ఒకటిన్నర శతాబ్దం నుంచి ఈ ప్రాంతంలో 14 గ్రామాల ప్రజలు పైడిమాంబను ఇలవేల్పుగా కొలుస్తున్నారు. 1978 నుంచి నిరాటంకంగా జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. గతంలో అక్కడక్కడా ఉండే జోడుగుళ్లపాలెం, విశాలాక్షినగర్, హనుమంతవాక, డెయిరీ ఫారం నుంచి ఆరిలోవ, తోటగరువు, రవీంద్రనగర్, పెదగదిలి, చినగదిలి, ఈగలపాలెం, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, పైనాపిల్ కాలనీ, దారపాలెం వరకు గ్రామాల ప్రజలు పైడిమాంబను గ్రామదేవతగా కొలచేవారట. ఇప్పుడా ప్రాంతాల్లో పదుల సంఖ్యలో కాలనీలు వెలిశాయి. దీంతో వేలాది మంది భక్తులు అమ్మవారిని పూజిస్తున్నారు. పూర్వీకుల నుంచి ఇక్కడ పైడిమాంబకు చీరలు చూపించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు నవరాత్రి ఉత్సవాల కోసం దూర ప్రాంతాల్లో ఉన్న తమ బంధువులను ఆనవాయితీగా పిలుచుకొని అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహిస్తుంటారు.



పైడిమాంబ ఆలయ ఆవరణలో భక్తుల కోసం వేసిన టెంట్లు



ఆలయం వద్ద రోడ్డుపై విద్యుద్దీపాల అలంకరణ

ముగింపు ఉత్సవాలకు సకల ఏర్పాట్లు

ఈ నెల 11తో నవరాత్రి ఉత్సవాలు ముగియనున్నాయి. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి భక్తులు పూజలు చేసేందుకు కర్రలతో లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునే భక్తుల సౌలభ్యం కోసం ఆలయ ఆవరణలో టెంట్లు వేశారు. సాయంత్రం పరస, జాతర జరగనుంది. బాణసంచా, తప్పెటగుళ్లు, పూసల డ్యాన్స్, పులివేషాలు, బుట్టబొమ్మలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జాతరలో ఎప్పటిలాగే భక్తులు తాకిడి ఉంటుందని తలచిన ఆరిలోవ పోలీసులు ఆలయం నుంచి రవీంద్రనగర్ వరకు బందోబస్తు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. ఆలయాన్ని, ఆవరణను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయం నుంచి పాత డెయిరీఫారం మీదుగా ఆదర్శనగర్ వరకు సుమారు కిలోమీటర్ పొడవున రోడ్డుకు ఇరుపక్కలా విద్యుత్ దీపాలంకరణ చేశారు.

భక్తులను ఆకట్టుకునేలా కార్యక్రమాలు



జాతర సందర్భంగా పైడిమాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు ఏటా వేలాది మంది భక్తులు వస్తుంటారు. వారి కోసం ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తుల పూజలు, మొక్కుల అనంతరం సాయంత్రం 5 గంటలకు జాతర, పరస ప్రారంభమవుతుంది. జాతరలో భక్తులను అలరించడానికి విజయనగరం తోళ పులివేషాలు, వరంగల్ తీన్‌మార్, ఇడిస్కా వారిచే దూమ్‌దడక, జొన్నపల్లి అప్పారావు బుట్టబొమ్మల డాన్స్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశాం.

– మీసాల వెంకటరాయుడు, ఆలయ కమిటీ అధ్యక్షుడు

అమ్మవారి సేవలో తరిస్తూ..



డెయిరీఫారం పైడిమాంబ ఆలయంలో 1999 నుంచి అర్చన చేస్తున్నాను. నిత్యం అమ్మవారికి భక్తులతో పూజలు, అభిషేకాలు చేయిస్తున్నాను. సాధారణ రోజుల్లో మంగళ, శుక్రవారాల్లో అమ్మవారిని ఎక్కువగా భక్తులు దర్శించుకుంటారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రోజూ భక్తుల తాకిడి ఉంటుంది. ఇక్కడి అమ్మవారిని భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. అమ్మవారి సేవలో తరిస్తుండటం అదృష్టంగా భావిస్తున్నాను.

– ఎం.గోపీకృష్ణ, ఆలయ అర్చకుడు

ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 22 మంది గైర్హాజరు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో శనివారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 22 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ పద్మావతి తెలిపారు. ఈ కేంద్రంలో జనరల్ విద్యార్థులు 110 మందికి గాను ఇద్దరు రాకపోవడంతో 108 మంది పరీక్ష రాశారన్నారు. ఒకేషనల్ కోర్సుల పరీక్షలకు 437 మంది గాను 20 మంది గైర్హాజరు కాగా.. 417 మంది పరీక్ష రాసినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రానికి 547 మందిని అలాట్ చేశారని, వీరిలో 525 మంది పరీక్ష రాయగా.. 22 మంది గైర్హాజరయ్యాని తెలిపారు.

మహిళా సాధికార భవనం ప్రారంభం

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు వివేకానందనగర్‌లోని మహిళా సాధికార భవనాన్ని మహిళా దినోత్సవం సందర్భంగా జోన్-2 అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీన్ని శనివారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించి మాట్లాడారు. ఈ భవనంలో మహిళలకు చేతి వృత్తుల్లో శిక్షణలు ఇస్తారన్నారు. బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు 3 నెలల పాటు టైలరింగ్ శిక్షణ ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, జోన్-2 ఇన్‌చార్జి కమిషనర్ కనక మహాలక్ష్మి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

అచ్చం.. పుష్పగుచ్ఛంలా...



ప్రత్యేక సందర్భాలు, అభినందనలు తెలిపే సమయంలో పుష్పగుచ్ఛాలు ఇవ్వడం అందరికీ అలవాటు. ఇటీవల కాలంలో పుష్పాలతో విరబూసిన మొక్కలను కూడా బహుమతులుగా అందిస్తున్నారు. బీచ్ రోడ్డులోని వీఎంఆర్‌డీఏ పార్క్‌లో పెంచుతున్న బోగన్ విల్లి మొక్క నిండా పుష్పాలతో ఎంతో అందంగా కనిపిస్తోంది. అచ్చం పుష్పగుచ్ఛాన్ని తలపించేలా పింక్ కలర్ పుష్పాలతో చూపరులను కనువిందు చేస్తోంది. - ఏయూక్యాంపస్

అన్ని రంగాల్లో మహిళలు ఎదగాలి



డాక్టర్ రాధారాణిని సన్మానించి మెమెంటో అందజేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆకాంక్షించారు. రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. వైద్య ఆరోగ్య శాఖలో 80 శాతం వరకు మహిళలు వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. మహిళలు మరింత ఆర్థికంగా, సామాజికంగా ప్రగతి సాధించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ జోనల్ మలేరియా డాక్టర్ పి.శాంతిప్రభ మాట్లాడుతూ మహిళలు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ పి.రాధారాణి మాట్లాడుతూ మహిళలు నేడు అన్ని రంగాల్లో ముందున్నారని, పురుషులతో సమానంగానే బాధ్యత కలిగి ఉంటున్నారన్నారు. ప్రాంతీయ మహిళా శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సుజాత మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో మహిళలు అధికంగా ఉద్యోగ అవకాశాలు కలిగి ఉన్నారన్నారు. ఏఎన్ఎం గాను, ఆశా కార్యకర్త గాను తమ సేవలు నిరంతరం కుటుంబానికి, సమాజానికి అందచేస్తున్నారని కొనియాడారు. జిల్లా మలేరియా అధికారి తులసి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను చిన్నతనం నుంచే ఆడ, మగ అనే తేడా లేకుండా సమానంగా పెంచుతూ, మహిళల పట్ల సామాజిక అవగాహన కలిగించాలని సూచించారు. జిల్లా మీడియా విస్తరణాధికారి(డిమో) బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళల గొప్పతనాన్ని వివరించారు. వైద్య ఆరోగ్య శాఖలో వివిధ విభాగాలకు చెందిన డాక్టర్ పి.నళిని, ఐ.మనోరమ, మణికుమారి, సుభాషిణి, భాగ్యరేఖ, లావణ్య, ఇంద్రజ తదతరులు ప్రసంగించారు. ఉత్తమ సేవలందించిన పలువురు మహిళలను ప్రముఖుల చేతుల మీదుగా సన్మానించి మెమెంటోలు అందజేశారు. పలు విభాగాల అధికారులు రవిశంకర్, జి.శ్రీనివాస్, నాగభూషణం, హెల్త్ ఎడ్యుకేటర్ సయ్యద్ బేగం వందన సమర్పణ చేసి హాజరైన అందరికీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

108 మహిళా ఉద్యోగుల ఆనందోత్సాహాలు

మహారాణిపేట: అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీస్ (108 అంబులెన్స్) మహిళా ఉద్యోగులందరూ ఆనందోత్సాహాలతో వుమెన్స్ డే వేడుకలు జరుపుకున్నారు. రేసపువానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలో కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ త్రినాథ్, జిల్లా కో ఆర్డినేటర్ సురేష్, మహిళా ఉద్యోగులు రమణమ్మ, శైలజ, ఎర్నమ్మ, సంతోషిని, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న 108 మహిళా ఉద్యోగులు

విమ్స్ కాంట్రాక్ట్ శానిటేషన్ కార్మికుల ధర్నా

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్ కార్మికులు శనివారం జాతీయ రహదారిని ఆనుకొని ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేశారు. కరోనా సెకండ్ వేవ్‌లో 42 రోజుల వేతనం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు పి.వెంకటరావు మాట్లాడుతూ మొదటి కరోనా సమయంలో కాంట్రాక్ట్ శానిటేషన్ వర్కర్లకు నెలకు రూ.16,000 వేతనం అమలు చేశారన్నారు. రెండో సారి కరోనా సమయంలో ఆ వేతనం చెల్లించలేదన్నారు. 42 రోజుల వేతనాన్ని వెంటనే చెల్లించకపోతే ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. విమ్స్‌లో కార్మిక చట్టాలు అమలు చేయకుండా కాంట్రాక్టర్ కార్మికులను వేధిస్తున్నారని ఆరోపించారు. ఆ కాంట్రాక్టర్‌పై విమ్స్ డైరెక్టర్ దర్యాప్తు జరిపించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శానిటేషన్ కార్మికులు పార్వతి, కనకరాజు, నగేష్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



విమ్స్ ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

రోప్ వే నిర్వాహకులపై చర్యలకు ఆదేశం

ఆరిలోవ: కైలాసగిరిపై శుక్రవారం సంభవించిన అగ్ని ప్రమాదానికి రోప్ వే నిర్వాహకుల నిర్లక్ష్యమే కారణమని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ స్పష్టం చేశారు. ప్రమాదానికి బాధ్యులైన వారికి నోటీసులు అందజేసి, తగిన జరిమానా విధించాలని అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన అధికారులతో కలిసి కైలాసగిరిని సందర్శించి, ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోప్ వే నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే అగ్ని ప్రమాదం జరిగిందన్నారు. దీనికి బాధ్యులైన వారికి వెంటనే నోటీసులు జారీ చేసి, జరిమానా విధించాలని అధికారులకు సూచించారు. రోప్ వేను కొద్ది రోజులు నిలిపివేయాలని, తగిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన తర్వాతే రోప్ వే నిర్వహణకు అనుమతి ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కైలాసగిరిపై జరుగుతున్న గ్లాస్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించి, పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కైలాసగిరికి వచ్చే సందర్శకుల కోసం మరిన్ని అడ్వెంచర్ క్రీడలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కొండపైకి డబుల్ డెక్కర్ బస్సుల రాకపోకలపై ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. తెన్నేటి పార్కు వద్ద కొత్తగా జిప్ లైనర్, స్కై డైవింగ్ వంటి సాహస క్రీడలను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీ కృష్ణ, ఇంజనీర్లు భవానీ శంకర్, రామరాజు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు



కైలాసగిరిపై అగ్నిమాదం జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

అతివలకు అభివందనం

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



డాక్టర్ విజయలక్ష్మికి బహుమతి అందజేస్తున్న జేసీఐ సభ్యులు

బీచ్‌రోడ్డు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళామూర్తులను ఘనంగా సత్కరించి, వారి సేవలను కొనియాడారు. జేసీఐ వైజాగ్ ఎచీవర్స్ ఆధ్వర్యంలో పెదవాల్తేరు ప్రభుత్వ మానసిక ఆస్పత్రి ప్రాంగణంలో జరిగిన వేడుకల్లో సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఆరోగ్య రంగంలో మహిళల సేవలు అమోఘమని ప్రశంసించారు. మానసిక ఆరోగ్య సంరక్షణలో మహిళా వైద్యులు, నర్సులు, సిబ్బంది ఎంతో సహనంతో, సేవా దృక్పథంతో పనిచేస్తున్నారని, వారిని గౌరవించడమే ఈ సమాజానికి మనం చేయగలిగే అతిపెద్ద కృతజ్ఞతని పేర్కొన్నారు. వైద్య రంగంలో విశేష కృషి చేస్తున్న డాక్టర్ విజయలక్ష్మితోపాటు డాక్టర్ అభినయ భారతి (ఫైనలియర్ పోస్ట్ గ్రాడ్యుయేట్), బి.విజయ భారతి(హెడ్ నర్స్), జక్కుల లక్ష్మి(స్టాఫ్ నర్స్), ఎం.సోనాలి దీక్షిత(జూనియర్ అసిస్టెంట్), ఎం.దీప(ఎఫ్‌ఎన్‌వో) తదితరులను ఘనంగా సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జేసీఐ ఫోర్ రీజియన్ సీ జోన్ వైస్ ప్రెసిడెంట్ జేఎఫ్‌జీ చైతన్య వసంతవాడ, జేసీఐ వైజాగ్ ఎచీవర్స్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.ఎస్.వి. సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'హంస' ఆధ్వర్యంలో..

ఏపీ మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్(హంస) ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో మహిళలకు ఆటల పోటీలు, వైద్య పరీక్షలు నిర్వహించారు. హంస అధ్యక్షుడు డి.చినబాబు మాట్లాడుతూ మ్యూజికల్ చైర్, కబడ్డీ, లెమన్ అండ్ స్పూన్ వంటి ఆటలతోపాటు మహిళల ఆరోగ్యానికి సంబంధించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కానిస్టేబుల్ రేవతికి సీమంతం

ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా కానిస్టేబుల్ రేవతికి రాష్ట్ర హోం మంత్రి అనిత సీమంతం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శివాజీపాలెంలోని హోం మంత్రి నివాసంలో రేవతికి చీర, పండ్లు అందజేసి సీమంతం జరిపారు. హోం మంత్రి అనితకు రేవతి, ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కేర్ ఆస్పత్రిలో..

ఆరిలోవ: హెల్త్‌సిటీ కేర్ ఆస్పత్రిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కేర్‌లో మోకాలి శస్త్రచికిత్సలు చేయించుకుని ఆరోగ్యంతో ఉన్న మహిళలకు, మహిళా సిబ్బందికి ఆస్పత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో సత్కరించి, పలు రకాల పళ్లు అందించారు. ఆస్పత్రి సీఈవో మయూక్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వట్టిపల్లి రవిచంద్ర మాట్లాడుతూ సమాజానికి, కుటుంబానికి వెన్నుముఖగా నిలిచిన మహిళలు ఆరోగ్యంగా ఉండాలన్నారు. కేర్‌లో ఎంతోమంది మహిళలు మోకాలి మార్పిడికి శస్త్రచికిత్సలు జరిపించుకొని సాధారణ ఆరోగ్యంతో తమ కుటుంబాలకు అండగా నిలిచారని చెప్పారు. అలాంటివారిని మహిళా దినోత్సవం సందర్భంగా గౌరవించుకున్నట్లు తెలిపారు. వారితోపాటు 15 ఏళ్లుగా కేర్ ఆస్పత్రిలో పనిచేస్తూ సేవలందిస్తున్న మహిళా ఉద్యోగులను ప్రోత్సహిస్తూ సత్కరించామన్నారు. కార్యక్రమంలో అతిథులు, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



కానిస్టేబుల్ రేవతికి సీమంతం చేస్తున్న హోం మంత్రి అనిత



కేర్ హాస్పిటల్‌లో సత్కారం పొందిన మహిళా పేషెంట్లు, ఆస్పత్రి సిబ్బంది



కృష్ణా డిగ్రీ కళాశాల మహిళా అధ్యాపకులతో ప్రిన్సిపాల్ విజయబాబు



మహిళలకు జ్ఞాపికలు అందిస్తున్న హంస ప్రతినిధులు



గీతాలాపన చేస్తున్న సాయివేద వాగ్దేవి

కృష్ణా కాలేజీలో..

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా అధ్యాపక బృందానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా అభ్యున్నతికి చేస్తున్న కృషిని కొనియాడారు. ప్రిన్సిపాల్‌ను మహిళా అధ్యాపకులు సత్కరించారు.

ఆర్టీసీ డిపో మహిళా సిబ్బందికి అవార్డులు

మద్దిలపాలెం ఆర్టీసీ డిపోలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ముఖ్య అతిథి విశాఖపట్నం రీజినల్ మేనేజర్ బి.అప్పలనాయుడు వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన ఐదుగురు మహిళా సిబ్బందిని సత్కరించారు. అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ మాధురి, అసిస్టెంట్ ఇంజినీర్ అచ్చియమ్మ, ప్రశాంతి సెక్యూరిటీ సంతోష్, లక్ష్మీసరోజ, వివిధ డిపోల కండక్టర్లకు రూ.500 క్యాష్ అవార్డులను అందజేశారు. మద్దిలపాలెం డిపోలో జరిగిన జిల్లా స్థాయి వేడుకల్లో సిబ్బందికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ ఉద్యోగం చేస్తున్న మహిళలు ఒత్తిడికి గురవుతున్నారన్నారు. వీరికి పురుషులు సహకరించి, వారి ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. విధుల్లో నిబద్ధతతో మరింత పేరుప్రతిష్టలు, ఉన్నతి సాధించాలని ఆకాంక్షించారు. డిపో మేనేజర్లు ప్రవీణ, అరుణకుమారి, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సెంచరీ క్లబ్‌లో ఘనంగా వేడుకలు

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులోని సెంచరీ క్లబ్‌లో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కేజీహెచ్ పూర్వ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.శశిప్రభను క్లబ్ తరఫున సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు తమ వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరం సరిగమప లిటిల్ చాంప్స్ కార్యక్రమ విజేత, గాయని ఎస్.సాయి వేద వాగ్దేవి గీతాలాపనతో అలరించింది. అమ్మ విశిష్టతను తెలుపుతూ చిన్నారి పాడిన పలు పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. క్లబ్ గౌరవ కార్యదర్శి వాసిరెడ్డి శ్రీమంత్, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న మద్దిలపాలెం ఆర్టీసీ డిపో మహిళా సిబ్బంది



డాక్టర్ శశిప్రభను సత్కరిస్తున్న సెంచరీ క్లబ్ సభ్యులు